ఓంశ్రీసాయిరాం

పరమ పావనమైన భారతావనియందు
సహనమన్నదె మనకు చక్కదనము
వ్రతములన్నింటను వన్నెగాంచినయట్టి
ఘనసత్యశీలమే కఠిన తపము
మధుర భావంబేది మన దేశమందన్న
మాతృభావము కంటె మాన్యమెద్ది
ప్రాణంబు కంటెను మానంబె ఘనమను
మన దేశ నీతిని మంటగలిపి
నేటికిచ్చిరి పరదేశ నీతులరసి
వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి
ఔర! ఏమందు భరత పాలనంబు
ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ
అట్టులైనారు భారతీయులు నేడు.

ప్రేమస్వరూపులారా!

భారతీయులు మహా భాగ్యవంతులు. భారతదేశము మహా భాగ్యవంతమైన దేశము. ఇది మహా పుణ్యభూమి, త్యాగభూమి, కర్మభూమి. ఇట్టి భారతదేశ ఔన్నత్యమును ఈనాడు మన భారతీయులే గుర్తించుకోటం లేదు. 'ఏనుగెట్టుల తన బలమెరుగలేదో అట్టులైనారు భారతీయులు నేడు'. ఏనుగు తోకతో కొడితే, మనిషి తొమ్మిదడుగుల దూరంలో పోయి పడతారు. అంతటి శక్తి కలిగిన ఏనుగును మావటి అంకుశముతో లొంగతీసుకుంటున్నాడు. తన బలమేమిటో తనకు తెలియకపోవటంచేత ఏనుగు మావటి చెప్పినట్లు వింటున్నది. అదేవిధముగా, భారతీయులు కేవలం దేహమును ఆధారం చేసుకొని, ఉపాధిపై ఆధారపడి తమ శక్తిని తాము తెలుసుకోలేకపోతున్నారు.

దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబుజూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

ఇట్టి సత్యాన్ని గుర్తించాలి. ఈ దేహములో ఉండినటువంటి శక్తి మరి దేనియందుకూడను లేదు. అవాఙ్మానస గోచరుడైన దైవాన్నికూడను కట్టివేయగల మహా సత్యశక్తి ఈ దేహమునందు ఉన్నది. ఇది 'సత్యస్య సత్యం'. ఈ సత్యశక్తిని ఎవ్వరూ పట్టలేరు. సత్యమును ఎవ్వరూ కాంచలేరు. దీనిని మనము అనుభవించవలసిందేగాని, వర్ణించుటకు వీలుకాదు. సత్యమనేదే దైవస్వరూపము. 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ'.

సత్యంబునుండి సర్వంబు సృష్టించె
సత్యంబునందణగె సర్వసృష్టి
సత్యమహిమలేని స్థలమేదొ కనుగొన్న
శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య.

ఈ జగత్తులో ఎందు చూచినా సత్యమే సాక్షాత్కరిస్తున్నది. మిథ్య అనేదే లేదు. కాని, మానవుడు అసత్యమైన దేహ ప్రవృత్తిని మాత్రమే గుర్తించుకొని, దీనినే సత్యముగా భావిస్తున్నాడు. మొట్టమొదట సత్యాన్ని గుర్తించాలి. సత్యాన్ని ప్రార్థించాలి. సత్యాన్ని నిలబెట్టుకోవాలి. 'సత్యాన్నాస్తి పరోధర్మః'. సత్యమే లేకుండిన ధర్మమే లేదు. సత్యమనే పునాదిపైననే ధర్మమనే భవనము నిలచియున్నది. ఈ సత్యమును గుర్తించటానికి మానవుడు ప్రయత్నించాలి. ఇంద్రియముల నరికట్టలేక, దేసంబంధమైన భ్రాంతులను వదలిపెట్టలేకకేవలం మీరు చదివిన చదువులను పురస్కరించుకొని నిత్యసత్యమైన ఆత్మతత్త్వాన్ని మరచిపోతున్నారు. అది ఎటువంటిది? 'నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య

శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపం'. మీయందే ఉన్న అట్టి సత్యమును విస్మరించి, అనిత్యము, అశాశ్వతము, అసత్యమైనటువంటిది కర్మేంద్రియ, జ్ఞానేంద్రియ. మానసిక తత్త్వములను అనుసరిస్తున్నారు. మనస్సు ఎటువంటిదో మీకు తెలుసునా? అది ఇష్టమొచ్చినట్లు ఎక్కడికి పడితే అక్కడికి పరిగెడుతుంది. సుగంధముతో కూడిన పుష్పములపైనా వ్రాలుతుంది, పెంటకుప్పపైనకూడా వ్రాలుతుంది. ఈరీతిగా మంచి, చెడు రెండింటిపైన వ్రాలే మనసును నీవు ఎట్లా నమ్మగలవు! Mind is like a mad monkey. Body is like a water bubble. ఇటువంటి దేహమును, మనస్సును నమ్ముకొని బ్రతుకుతున్నాము. ఏనాడు నీవు దేహభ్రాంతిని వదలి, ఇంద్రియముల తత్త్వమును మరచిపోయి, ఆత్మతత్త్వమునే చింతిస్తావో, ఆనాడు నీవే ఆత్మస్వరూపుడవైపోతావు. అప్పుడు నీవు మానవుడివి కావు, మాధవుడవే! మాధవుడవే నీవైయుండి 'నేను మానవుడన'ని భ్రమిస్తున్నావు. ఈ జగత్తు నిమిత్తమై నీవు మానవ రూపాన్ని ధరించావు. ఈ మానవ రూపము కేవలం ఒక వేషము. ఈ ప్రపంచమందు ఉన్నంత వరకు ఈ వేషము ధరిస్తావు. జగత్తనే స్టేజి వెనుకకు పోతూనే ఈ డ్రస్సును వదలి పెడతావు. ఈ డ్రస్సును బట్టి నీవు నాటకమాడుతున్నావు. నీ నిజమైన స్వరూపాన్ని నీవు గుర్తించాలి.

మానవత్వము పవిత్రమైనది, దివ్యమైనది. ఇట్టి మానవత్వాన్ని మట్టి కలుపుతున్నాడు మానవుడు. దీనిని సార్థకం గావించుకోవాలి. నీవు నేర్చిన విద్యలు, నీ శక్తిసామర్థ్యములు ఇవన్నీ క్షణభంగురములు. నిత్యసత్యమైన తత్త్వాన్ని గుర్తించటానికి నీవు ప్రయత్నించాలి. నీవు దేహము కాదు. 'మీరెవరండి?' అని ఎవరైనా నిన్ను ప్రశ్నిస్తే. 'నేను ఫలానివాడిని' అని చెబుతావు. నీ దేహమును, నీ వృత్తిని, నీ వంశమును, నీవు నివసించే ప్రాంతమును పురస్కరించుకొని నిన్ను నీవు పరిచయం చేసుకుంటావు. 'నా పేరు రామదాసు' అంటావు. ఇది నీ తల్లిదండ్రులు పెట్టిన పేరు. 'రామదాసు ఎవరు?' అని అడిగితే 'నేను' అంటావు. కాని, 'రామదాసు' అనేది కేవలం నీ దేహమునకు పెట్టిన పేరుగాని, నీ పేరు కాదు. 'నేను' అన్నదే నీ అసలైన పేరు. అదే నిత్యసత్యమైనది.

'రామదాసు' అంటే దశరథ కుమారుడైన రామునికి దాసుడు. దశరథుడంటే అయోధ్యానగరాన్ని పాలించిన ధశరథుడు కాదు. యోధులు సహితం చొరటానికి వీలుకాని ప్రదేశమే అయోధ్య. ధశేంద్రియములతో కూడిన దేహమే దశరథుడు. దశరథునికి ముగ్గురు భార్యలు. కౌసల్య, సుమిత్ర, కైకేయి. వీరు ముగ్గురూ సత్త్వరజస్తమో గుణములకు ప్రతీకలు. సాత్విక గుణమే కౌసల్య, రజోగుణమే కైక, తమోగుణమే సుమిత్ర. కనుక, ఈవిధంగా అంతర్దృష్టితో విచారణచేసి మొట్టమొదట మనము మనలో ఉన్న సత్యాన్ని గుర్తించాలి. ఆనాటి మహనీయులు ఇట్టి సత్యాన్ని గుర్తించారు. గుర్తించి వర్తించారు. మన ప్రాచీనులు ఆనాటి మానవులవలె మూర్ఖంగా ప్రవర్తించేవారు కాదు. వారు సత్యాన్ని గుర్తించి, సత్యాన్ని బోధించి, సత్యముతోనే జీవించారు. సహనమే భారతీయుల సహజ లక్షణము. సహనము లేనివాడు మానవుడే కాదు.

'మాతృదేవో భవ, పితృదేవో భవ'. భారతీయ సంస్కృతిలో తల్లికే ప్రథమ స్థానము అందించబడింది. రామునికి సుప్రభాతము చెప్పే సమయంలో మొట్టమొదట 'కౌసల్యా సుప్రజా రామా..' అంటారు. మానవునికి తల్లియే ప్రథమ దైవం. కాని, ఈనాడు తల్లిని ఎంతమంది గౌరవిస్తున్నారు! రాముడు విశ్వామిత్రుని యాగసంరక్షణార్థం వెళ్లే సమయంలో తల్లి పాదాలకు నమస్కరించగా ఆమె, ' నాయనా! అలనాడు ప్రహ్లాదుని పాలించిన పరమపురుషుడు ధ్రువకుమారుని సాకిన వైకుంఠవాసి, ఆ అమరవంద్యుడు, ఆర్తజనులను పాలించు ఆ అనాథనాథుడు నీకు విజయము చేకూర్చుగాక' అని ఆశీర్వదించి పంపింది. ఆ తల్లి ఆశీర్వాదబలము చేతనే రాముడు రాక్షసులను సంహరించి యాగసంరక్షణ గావించాడు. అంతేకాదు, జనకమహారాజు సభలో శివధనుర్భంగము గావించి పోటీలో ఉత్తీర్ణుడయ్యాడు. కర్మయోగి, మహాజ్ఞాని అయినటువంటి జనకుడు నిండుసభలో రాముని పాదములు పట్టుకొని, 'నాయనా! నీకంటె మించినవారు లేరు. ఇదుగో, నా కుమార్తెను నీకిచ్చి వివాహం చెయాలనుకుంటున్నాను' అన్నాడు. కాని, రాముడు తన తల్లిదండ్రుల అనుమతి లేకుండా వివాహానికి అంగీకరించనన్నాడు. ఈనాటి యువకులు తమకు వివాహం నిశ్చయమైతే, ఓహో.. గొప్పగా పత్రికలు ముద్రించి అందరికీ పంచుతారు. కాని, రాముడు అలా చేయలేదు. 'మేము నలుగురం ఒకే సమయంలో పుట్టాము. కాబట్టి, ఉపనయనముగాని, వివాహముగాని ఏది జరిగినా మా నలుగురికీ ఒకే సమయంలో జరగాలి' అని భావించాడు. 'తక్షణమే ఈ వార్తను తల్లిదండ్రులకు తెలియజేయండి' అన్నాడు. ఈనాటి పిల్లలు 'ఎంగేజిమెంట్' అయిన తక్షణమే ఇద్దరూ కలసి సినిమాలకు వెడతారు. ఇది మంచి పద్ధతి కాదు. వివాహం జరిగేంతవరకు సాత బయటకే రాలేదు. రాములు ఆమెను చూడలేదు. తల్లిదండ్రులు వచ్చిన

తరువాత, విశ్వామిత్రుడు చెప్పిన తరువాత అప్పుడు రాముడు వివాహానికి ఒప్పుకున్నాడు. ఒప్పుకున్నాడేగాని తాను సీతను చూడలేదు.

వివాహ సందర్భంగా వధూవరులు ఒకరికొకరు పూలమాలలు వేసుకోవాలి. రామ, లక్ష్మణ, భరత, శతృఘ్నులు వరుసగా నిల్చున్నారు. అందరికంటే రాముడు పెద్దవాడు. కాబట్టి, మొట్టమొదట సీత రాముని మెడలో మాల వేయాలి. ఆ తరువాతనే లక్ష్మణ, భరత, శతృఘ్నులకు వారివారి వధువులు మాలలు వేస్తారు. సీత తన చేతిలో మాల పట్టుకొని నిల్చుంది. కాని, రాముడు ఆమెవైపు చూడలేదు. ఎందుకంటే, అప్పటికింకా వివాహం కాలేదు. వివాహం కానంతవరకు ఆమె పరస్త్రీయే! పరస్త్రీని కన్నెత్తి చూడటం మహాపాపం. సీత ఎంతసేపో కాచుకుంది, పాపం! కాని, రాముడు తలవంచలేదు. దాంతో అతనికి మాల వేయటం ఆమెకు సాధ్యం కాలేదు. అప్పుడు లక్ష్మణుడు ఒక యుక్తి పన్నాడు. ఉన్నట్లుండి తాను వచ్చి రాముని పాదాలపై వ్రాలినాడు. రాముడు అతనిని లేవనెత్తటానికి వంగేసరికి సీత తక్షణమే రాముని మెడలో మాల వేసింది.

చూశారా! ఆనాటివారి హృదయాలు ఎంత పవిత్రమైనవి! ఎంత నిత్యసత్యమైనవి! త్రేతాయుగ, ద్వాపరయుగాలలో ప్రజలు సత్శీలమునకు ఎంతో ప్రాధాన్యత నిచ్చినారు. అందుచేతనే, ఆయా యుగాలకు అంత గొప్ప పేరు వచ్చింది. రామునివలె మీరుకూడా ప్రతి విషయంలోనూ పెద్దల ఆజ్ఞను పాటించాలి. పెద్దలను పూజించాలి, గౌరవించాలి. పెద్దల మాటలను అశ్రద్ధ చేయక ప్రేమతో పాటించినప్పుడే మీరు జీవితంలో శాంతిని అనుభవించగలరు.

రామాయణంలో చిత్రవిచిత్రమైన సంఘటనలనేకం జరుగుతూ వచ్చాయి. దశరథుడు కైకకు ఇచ్చిన మాట ప్రకారం పధ్నాలుగేళ్ళు అరణ్యవాసం చేయవలసి వచ్చింది. తాను ఎంత గొప్ప రాణి అయినప్పటికీ కైక తన సర్వెంట్ చెప్పిన మాటలకు లొంగిపోయింది. మంథర ప్రోద్బలంచేత రాముణ్ణి అరణ్యానికి పంపింది. మనము విలువ ఇవ్వవలసినది యజమాని మాటకేగాని, సర్వెంట్ మాటలకు కాదు. సర్వెంట్ మాటలకు లొంగిపోవటం వల్ల కైక దుఃఖానికి గురైంది. రాముని వెంట సీతకూడా అరణ్యానికి బయలుదేరింది. 'నాథా! సతికి పతియే దైవము. పతి ఎక్కడుంటే సతి అక్కడుండాలి' అన్నది. 'అన్నా! నిన్ను విడిచి నేను ఒక్క క్షణమైనా ఉండలేను' అంటూ లక్ష్మణుడు కూడా వారివెంట అరణ్యానికి వెళ్లాడు.

లక్ష్మణ, శత్రుఘ్నులు సుమిత్రకు పుట్టినవారు. సుమిత్ర మహాగుణవంతురాలు. సార్థకనామధేయురాలు. తన కమారు లిద్దరినీ సేవకే అంకితం చేసింది. ఆమె అభీష్టం మేరకు లక్ష్మణుడు రామునికి సేవచేస్తూ వచ్చాడు. శత్రుఘ్నుడు భరతుని సేవచేస్తూ వచ్చాడు. సీతారామలక్ష్మణులు ముగ్గురూ అరణ్యంలో అనేక కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఇది అందరికీ తెలుసిన విషయమే. ఒకనాడు రామలక్ష్మణులు అరణ్యంలో సంచరించుచుండగా ఉన్నట్లుండి లక్ష్మణుని మనస్సు మారిపోయింది. 'అన్నా! ఎందుకు మనకీ అరణ్యవాసం? ఎందుకిన్ని కష్టాలను అనుభవించాలి? ఎండ కన్నెరుగని సీతమ్మను ఎందుకిన్ని బాధలకు గురిచెయ్యాలి? ఈ అరణ్యంలో రాక్షసుల బారినుండి సీతమ్మను కాపాడుకోటం చాలా కష్టం. కాబట్టి, మనం అయోధ్యకు తిరిగి వెళ్లి సుఖంగా జీవిద్దాం' అన్నాడు. అప్పుడు రాముడు గ్రహించాడు, అది స్థల ప్రభావమని. చిరునవ్వుతో లక్ష్మణుని చేయి పట్టుకొని కొంత దూరం ముందుకు నడిచి, 'ఇప్పుడు చెప్పు లక్ష్మణా! మనం తిరిగి అయోధ్యకు వెడదామా?' అన్నాడు. లక్ష్మణుడు తన పొరపాటును గ్రహించి పశ్చాత్తాపపడ్డాడు. 'అన్నా! మనం అయోధ్యకు పోనక్కరలేదు. తండ్రి ఆజ్ఞ ప్రకారం మనం పధ్నాలుగేళ్ళు అరణ్యంలోనే జీవించాలి. ఏనాడు నీకు ఎదురు చెప్పని నేను ఈనాడు ఎందుకిలా మాట్లాడాను? నా మనస్సు ఎందుకీవిధంగా మారిపోయిందో నాకు బోధపడటం లేదు' అన్నాడు. 'లక్ష్మణా! ఇది నీకు సహజంగా ఉన్న గుణము కాదు. ఇది స్థల ప్రభావము. ఈ ప్రదేశంలో రాక్షసులనేకులు సంచరిస్తున్నారు. రాక్షసులు సంచరించే ప్రదేశంలో ప్రవేశించావు. కనుకనే నీలో రాక్షస గుణములు ప్రవేశించాయి' అని చెప్పి రాముడు లక్ష్మణుని సమాధానపరిచాడు. కనుక, మనము దేశ, కాల పరిస్థితులను, మనం సంచరించే స్థల ప్రభావాన్నికూడా దృష్టిలో ఉంచుకొని వర్తిస్తూ రావాలి. సత్శీలమును గురించి రామాయణము బోధించినంతగా మరే గ్రంథమూ బోధించటం లేదు. ఈనాడు చాలామంది రామాయణ విశిష్టతను గుర్తించుకోలేకపోతున్నారు. భారతీయులయొక్క హృదయమే రామాయణము. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించలేకపోవటమే ఈనాడు భారతీయులు పడుతున్న అన్ని కష్టాలకు మూలకారణం.

ఎక్కడ ఉండిననూ మనిషికి బాధలు తప్పునవి కావు. అయితే, భగవంతునిపై భారం వేసి వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి.

అడవిలోననున్న ఆకాశమున నున్న
పట్టణమున నున్న పల్లెనున్న
గుట్టమీద నున్న నట్టేటనున్నను
దిక్కులేనివానికి దిక్కు దేవుడేను.

భగవంతుని తత్త్వాన్ని గుర్తించుకున్నవారికే ఈ సత్యము అర్థమవుతుంది. ముఖ్యంగా, ఈనాటి యువకులందరూ సద్గుణాలను పెంచుకోవాలి. మీరందరూ భగవంతునియొక్క బిడ్డలే. భగవంతుడే చెప్పాడు, 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'. కనుక, భగవంతుని గుణములను అనుసరించి, భగవంతునివలె మనము జీవించాలి. 'మేము భగవంతుని అంశము' అని భావించినప్పుడే మీరు బాగుపడతారు. 'నేను ఫలాని వ్యక్తి కుమారుణ్ణి, ఫలానివాని సోదరుణ్ణి, ఫలానివాని బావమరిదిని' అని అనుకున్నంతకాలం మీరు ఫలానివారిగానే మిగిలిపోతారు. 'నేను భగవంతుని అంశమును' అని గుర్తించినప్పుడే మీకు ఆత్మతత్త్వము అర్థమవుతుంది.

ప్రేమస్వరూపులారా! మీరందరూ మంచి పిల్లలే. అంతా బంగారువంటి పిల్లలే. కాని, వాతావరణము మిమ్మల్ని కొంత పాడుచేస్తుంది, ఆహారముకూడను కొంత పాడుచేస్తుంది. నీ స్నేహితులు మంచివారైతే నీకు మంచి మాటలు చెబుతారు. మంచివారు కాకపోతే నీకు చెడ్డ విషయాలు చెబుతారు, చెడ్డ ఆలోచనలు కలిగిస్తారు. Tell me your company, I shall tell you what you are. నీవు ఎలాంటి స్నేహితులతో చేరావో నాకు చెబితే నీవు ఎలాంటివాడవో నేను చెప్పగలను. కనుక, మీరందరూకూడను మంచి స్నేహితులతో చేరాలి.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

ఇతరులు చెప్పే 'న్యూసెన్స్' మాటలు విని మీరు మీ జీవితాన్ని 'న్యూసెన్స్'గా చేసుకోవద్దు. సత్సంగంలో చేరి మంచి పేరు తెచ్చుకోండి. Be good, do good, see good. This is the way to God. ఈరీతిగా ఉన్నప్పుడే మీకు దివ్యత్వం అర్థమవుతుంది.

ప్రేమస్వరూపులారా! మీరు మీ జీవితమును రామాయణంగా తీర్చిదిద్దుకోవాలి. 'దేవుడు ఎక్కడున్నాడు?' అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే 'నాలోనే ఆత్మరూపుడై ఉన్నాడు' అని చెప్పాలి. ఆత్మయే నీవు. ఆత్మకంటే మించినది మరొకటి లేదు. దానినే 'కాన్షియస్‌నెస్' అంటారు. మీ అంతరాత్మను మీరు అనుసరించండి. పిచ్చిపిచ్చి భావాలను దూరం చేసుకోండి. అవి వచ్చినప్పుడు మీరేమాత్రము వాటినిగూర్చి చింతించకండి. మీరు అనేక దృశ్యాలను కంటితో చూస్తూ, అనేకవిషయాలను చెవులతో వింటూ ఈ ప్రపంచంలో జీవనం సాగిస్తున్నప్పుడు చెడ్డభావాలు వస్తుంటాయి. మీకు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములనే ఆరుమంది శత్రువులున్నారు. ఈ ఆరుమందీ మిమ్మల్ని చెడ్డమార్గంలో తీసుకుపోతుంటారు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలే మనకు మంచి స్నేహితులు. వారితో స్నేహాన్ని అభివృద్ధి చేసుకోండి. మంచివారితో స్నేహం చేస్తే మీరు 'గుడ్ బాయ్స్' అవుతారు. లేకపోతే 'బేడ్ బాయ్స్'గా మారిపోతారు. మంచిపేరు తెచ్చుకోండి. మీ తల్లిదండ్రులకుకూడా మంచి పేరు తీసుకురండి. మీపైన తల్లిదండ్రులు ఎంతో ఆశను పెట్టుకొని ఉంటారు. కాబట్టి, వారిని సంతోషపెట్టండి. వారి ఆజ్ఞను మీరు శిరసావహించండి. అప్పుడే మీరు ధన్యులౌతారు, పుణ్యులౌతారు.

(అతిరుద్రమహాయజ్ఞ సందర్భంగా 14.08.2006 సాయంత్రం సాయికుల్వంత్‌లో భగవాన్‌బాబావారి దివ్యోపన్యాసము)